క్లుప్తంగా

తిరునాళ్లకు ఆహ్వానం



దద్దాలను సన్మానిస్తున్న నాయకులు

కనిగిరిరూరల్: వెలిగండ్ల మండలం మొగుళ్లూరు పంచాయతీ బూడిద పాలెంలో ఈనెల 9, 10, 11 తేదీల్లో జరిగే ఎల్లమ్మ తల్లి తిరునాళ్ల, కొలుపుల మహోత్సవానికి స్థానిక నాయకులు వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణను ఆహ్వానించారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో గ్రామ పార్టీ నాయకులు, కమిటీ వారు ఆహ్వాన ప్రతాన్ని అందజేసి, అనంతరం దద్దాలను ఘనంగా సన్మానించి, అమ్మవారి చిత్రపటాన్ని అందచేశారు. కార్యక్రమంలో నాయకులు పల్నాటి భాస్కర్‌రెడ్డి, ఆవుల తిరుపతిరెడ్డి (ఏటీఆర్), పల్నాటి వెంకట రెడ్డి, పల్నాటి ప్రభాకర్, పాతకొట్టు తిరుపాలు, ఆవుల వెంకట నారాయణ, రావుల వెంకట కొండయ్య, తమ్మినేని శివరామిరెడ్డి, పల్నాటి కృష్ణారెడ్డి, కర్నాటి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం

పొన్నలూరు: ఉపాధి హామీ పథకం ద్వారా 2025–26 ఆర్థిక సంవత్సరానికి మండలంలో పండ్ల తోటల పెంపకానికి చిన్న, సన్నకారు రైతులకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు ఎంపీడీఓ డాక్టర్ సుజాత శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఐదెకరాల్లోపు పొలం ఉన్న రైతులు వారి ఆసక్తిని బట్టి మామిడి, నిమ్మ, జామ, సపోటా, దానిమ్మ, తైవాన్ జామతో పాటు పలు రకాల పండల తోట పెంపకానికి మూడేళ్ల పాటు దశల వారిగా పెట్టుబడి సాయాన్ని ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం అందిస్తుందన్నారు. గ్రామాలోని చిన్న, సన్నకారు రైతులు పంచాయతీలోని ఉపాధి సిబ్బందిని కలిసి వివరాలు అందజేసి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్ష

హనుమంతునిపాడు: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై ఎం.మాధవరావు వాహనదారులను హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధిలో కంభం–కనిగిరి రహదారిలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారుడు హెల్మెంట్ ధరించాలన్నారు. ఆటో డ్రైవర్లకు లైసెన్స్ లేకపోతే శాఖ పరమైన చర్యలు తప్పవన్నారు. పోలీసుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు.

ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దాతలు

పామూరు: వేసవి దృష్ట్యా ప్రయాణికులు, పాదచారులకోసం దాతలు ఉచిత మజ్జిగ పంపిణీ చేయడం అభిందనీయమని యారవ శ్రీనివాసులు అన్నారు. స్వయంకృషి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షుడు డాక్టర్ షేక్.నాయబ్‌రసూల్ సీఎస్‌పురం రోడ్డులో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన దాతతో కలిసి ప్రారంభించారు. స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు ఇలాంటి కార్యక్రమాలు విస్తృతం చేసి ప్రజల మన్ననలు పొందాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కందుల శ్రీనివాసరెడ్డి, దుద్దుకూరి శ్రీనివాసులుయాదవ్, డీ సుబ్బయ్య, హాజీగౌస్, ఖాజీ ఖాదర్‌బాషా, సీపీఐ మండల కార్యదర్శి పోతల ప్రభాకర్, వార్డు సభ్యులు పిడుగు శ్రీనివాసులు, శేషం మోసె, సోమిశెట్టి సత్యనారాయణ, జిలాని, ప్రసాద్, పలువురు పాల్గొన్నారు.

మహనీయుడు ఆది శంకరాచార్యులు



ఆది శంకరాచార్యుల జయంతిని నిర్వహిస్తున్న అర్చకుడు రాఘవేంద్ర శర్మ

కొండపి: మండలంలోని కే.ఉప్పలపాడు శివాలయంలో ఆది శంకరాచార్యుల జయంతి వేడుకలను శుక్రవారం అర్చకుడు రాఘవేంద్రశర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు రాఘవేంద్ర శర్మ మాట్లాడుతూ శ్రౌత, స్మార్తక కర్మలను పునర్దరించి వైదిక మతాన్ని పునఃస్థాపితం చేయడానికి స్వయంగా శంకరుడే భూమి పై అవతరించాడన్నారు. ఆ వైదిక ధర్మాన్ని ప్రతిష్ఠించి నిరంతరంగా కొనసాగడానికి ఆసేతు హిమాచలం వరకు కాలినడకన మూడుసార్లు పర్యటించి దేశానికి నలువైపులా నాలుగు పీఠాలను స్థాపించిన మహనీయుడు శంకరాచార్యులు అని పేర్కొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ న్యాయవాది వాకా వెంకట నరసింహారెడ్డి, మాజీ రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఆదినారాయణ, గ్రామస్తులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నెత్తిన ప్లాస్టిక్ బాంబ్ !



కొండపి-కట్టవారిపాలెం ప్రధాన రహదారి పక్కన పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు



స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మంత్రి స్వామి, అధికారులు (ఫైల్)

- రోజురోజుకూ పెరిగి పోతున్న ప్లాస్టిక్ వాడకం
- నియోజకవర్గంలో 1000కి పైనే వివిధ షాపులు
- నినాదాలకే స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం
- ప్లాస్టిక్‌పై కనీసం అవగాహన కల్పించని అధికారులు

కొండపి:

ఉదయం లేచింది మొదలు టిఫిన్లు, కూరగాయలు, పండ్లు, కిరాణా సామాన్లు, పూలు.. ఒక్కటేమిటి ప్రతి వస్తువును ప్లాస్టిక్ కవర్లతోనే ఇళ్లకు తీసుకు వస్తున్నాం. ఆఖరికి హోటల్ నుంచి తీసుకొచ్చే టీ తెచ్చుకునేందుకు సైతం పాలిథీన్ కవర్లను కావాలనే వినియోగిస్తున్నారు. అందుకే ఏ ఇంట్లో చూసినా ప్లాస్టిక్ కవర్లు నిండిపోతున్నాయి. ప్రజలంతా కొనసాగిస్తున్న ఈ తప్పు భావితరాలకు పెనుముప్పుగా మారుతుందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విచ్చలవిడిగా ప్లాస్టిక్ గ్లాసులు, కవర్ల వినియోగం వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్న పరిస్థితిలో మార్పు రావడం లేదు.

మురుగునీటి పారుదలకు ఆటంకం..

పర్యావరణ పరిరక్షణ చట్టం–2021 ప్రకారం 50 మైక్రాన్‌ల కన్నా తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ వస్తువుల వాడకం పూర్తిగా నిషేధం. అంతకంటే తక్కువ మందమున్న వాటితోనే నేల, నీరు, పర్యావరణం విషతుల్యంగా మారుతుంది. ఫలితంగా అనేక అనర్థాలు తలెత్తుతాయని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోని కొండపి, సింగరాయకొండ, టంగుటూరు మండల కేంద్రాలు వ్యాపార కేంద్రాలుగా ఉన్నాయి. చిన్న పాటి వస్తువుల నుంచి మాంసం తీసుకునే కవర్ల వరకు అన్ని సింగిల్ యూజ్ కు చెందినవే. వీటితో పాటు ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు, స్పూన్లు స్ట్రాలు, వాటర్ బాటిల్, ఆహార డబ్బాలు, ప్యాకింగ్ కవర్లు వంటివి ఇష్టారీతిన మార్కెట్లో లభ్యమవుతున్నాయి. రోజు వేలల్లో కవర్లు రోడ్లు పక్కన, మురుగు కాలవలోనికి చేరుతున్నాయి. వీటివల్ల వర్షాలు పడినప్పుడు మురుగునీరు రహదారులపై పొంగి ప్రవహిస్తుంది.

ఫొటోలకే స్వచ్ఛ ఆంధ్ర..

కొండపి నియోజకవర్గంలో సింగరాయకొండ, టంగుటూరు, పొన్నలూరు, జరుగుమల్లి, కొండపి, మర్రిపూడి మండలాల్లో సుమారు 1000 వరకు వివిధ షాపులు ఉన్నట్లు అంచనా. ప్రతి షాప్ లోను పాలథీన్ కవర్ల వినియోగం అధికంగా ఉంది. ప్రత్యేమ్నాయంగా జనపనార, కాగితం కవర్లు వాడాలని ప్రభుత్వం సూచిస్తుంది. ప్రతి మూడో శనివారాన్ని పరిసరాల పరిశుభ్రతలో భాగంగా ప్రభుత్వం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. దీనిలో భాగంగా గత నెల మూడో శనివారం కొండపిలో మంత్రి స్వామి పర్యటించి సింగల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు వద్దు, పునర్వినియోగవస్తువులే ముద్దు అన్న నినాదంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొక్కుబడిగా ర్యాలీ కార్యక్రమం నిర్వహించి ఫొటోలు తీసుకున్నారు. ఆ తర్వాత ప్లాస్టిక్ వినియోగంపై ఏ ఒక్క అధికారి ప్రజలకు అవగాహన కల్పించిన పాపాన పోలేదు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం కేవలం ఫోటోలకే పరిమితం చేస్తున్నారని అధికారులు మెప్పుకోసమే ఆ ఒక్కరోజు కార్యక్రమం నిర్వహిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు.



ప్లాస్టిక్ కవర్లలో వస్తువులను తీసుకువెళ్తున్న ప్రజలు

ప్లాస్టిక్ నియంత్రణ మన బాధ్యత..



ప్లాస్టిక్ కాలుష్యం సముద్రాలకు ఒక తీవ్రమైన ముప్పు. ప్రపంచంలో ప్రతినెల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రాల్లోకి పోతున్నాయి. ఇది సముద్ర జీవులకు, పర్యావరణానికి తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగాన్ని తగ్గించుకోవాలి. ప్లాస్టిక్ కాలుష్యాన్ని నియంత్రించడం మనందరి బాధ్యత.

–డాక్టర్ వరలక్ష్మి, సీహెచ్‌సీ సూపరింటెండెంట్

ప్లాస్టిక్ క్యాన్సర్‌కు కారణం



ప్లాస్టిక్ అధిక మోతాదులలో వాడడం వలన క్యాన్సర్ బారిన పడతారు. ఇంటి నుంచి బయటికి వెళ్లేటప్పుడు ప్రతి ఒక్కరూ క్లాత్‌తో తయారు చేసిన సంచులు తీసుకువెళ్లితే సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని నిషేధించవచ్చు. మార్పు ప్రతి ఇంటి నుంచి ప్రారంభం కావాలి.

– డాక్టర్ వరుణ్, సీహెచ్‌సీ వైద్యుడు

నాణ్యమైన బేళ్లకే అధిక ధర



రైతులతో మాట్లాడుతున్న వేలం నిర్వహణాధికారి సునీల్ కుమార్



టంగుటూరులో వేలంలో పాల్గొన్న వ్యాపారులు

కొండపి: నాణ్యమైన బేళ్లకే అధిక ధర లభిస్తుందని కొండపి వేలం నిర్వహణ అధికారి జి. సునీల్ కుమార్ అన్నారు. శుక్రవారం వేలం సందర్భంగా రైతులకు ఆయన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేళ్లలో అన్య పదార్థాలు కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శుక్రవారం స్థానిక పొగాకు వేలం కేంద్రంలో నిర్వహించిన వేలంలో క్లస్టర్ పరిధిలోని కామేపల్లి, పచ్చవ గ్రామాలకు చెందిన రైతులు 1097 బేళ్లను వేలానికి తీసుకుని వచ్చారు. అందులో 884 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 213 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ఠ ధర కేజీ రూ. 280, కనిష్ఠ ధర కేజీ రూ.210, సరాసరి ధర కేజీ రూ 258.33 గా నమోదైంది. వేలంలో 19 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

అన్యపదార్థాలతో తక్కువ ధర..

టంగుటూరు: రైతులు గ్రేడింగ్ సమయంలో పొగాకులో అన్యపదార్థాలు లేకుండా చూసుకోవాలి.. అలాంటి పొగాకు బేళ్లకు అధిక ధరలు పొందవచ్చని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం రైతులకు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం నిర్వహించిన వేలంలో జమ్ములపాలెం, తుమాడు గ్రామాలకు చెందిన రైతులు 633 బేళ్లను వేలాని తీసుకురాగా వాటిలో 553 కొనుగోలు జరిగగా 80 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. గరిష్ఠ ధర రూ. 280 కాగా, కనిష్ఠ ధర రూ. 215 పలకగా, సరాసరి రూ. 249. 11 ధర పలికింది. ఈ వేలంలో మొత్తం 20 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

కనిగిరిలో ఉరుములు, మెరుపులతో వర్షం



వర్ష ప్రభావిత ప్రాంతల్లో పర్యటిస్తున్న చైర్మన్ గఫార్



బాధితులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి

కనిగిరిరూరల్: తెల్లవారుజామున సుమారు గంటన్నర పాటు కురిసిన వర్షానికి కనిగిరి పట్టణం తడిముద్దయింది. పట్టణంలోని వీధుల్లో కాలువల్లోని నీరు పైకి వచ్చాయి. కొన్ని చోట్ల కాలువల్లో పూడిక తీతలు జరగక పోవడంతో ఇళ్లల్లోకి నీరు వెళ్లాయి. ప్రధాన కార్యాలయాల్లోని ప్రాంగణాల గుంతల్లో నీరు చేరడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. గాలివానకు పలు చోట్ల చెట్లు విరిగికింద పడ్డాయి. విద్యుత్ స్తంభాలు వరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. శివారు ప్రాంతాల్లోని రోడ్లు చిత్తడిమయంగా మారడంతో ప్రజలు నడవడానికి ఇబ్బందులు పడ్డారు.

వార్డుల్లో పర్యటించిన చైర్మన్ గఫార్..

వర్ష ప్రభావిత ప్రాంతాల్లో చైర్మన్ అబ్దుల్ గఫార్ శుక్రవారం పర్యటించారు. పట్టణంలోని 9వ వార్డు వాల్మీకి వీధిలో రహదారులు, ఇళ్లల్లోకి నీరు చేరాయని ప్రజలు ఫిర్యాదు చేయడంతో తక్షణ చర్యగా చర్యగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. కచ్చా కాలువను 5 అడుగుల లోతు వరకు తీసి నీరు ప్రవహించే విధంగా చర్యలు తీసుకోవాలని శానటరీ ఇన్స్పెక్టర్ నాయబ్ రసూల్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు. మండలంలోని కలగట్ల గ్రామంలో పిడుగు పాటుకు నూతతోటి శివ పార్వతమ్మకు చెందిన మేకలు మృతి చెందడంతో నాయకులు పరామర్శించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, సర్పంచ్ ఎం బ్రహ్మారెడ్డి, శ్రీహరి, మహేంద్రారెడ్డి, రమేష్‌రెడ్డిలు సందర్శించారు. ప్రకృతి విపత్తుల నష్టం కింద బాధిత రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలిని కోరారు. అలాగే బాధిత రైతుకు 50 శాతం సబ్సీడిపై తక్షణ సాయం జీవాలను ప్రభుత్వం అందించి ఆదుకోవాలని సీపీఎం నాయకులు పీవీ శేషయ్య డిమాండ్ చేశారు.

పీఎం సభ కోసం అధికారుల పాట్లు

- ఆహారం, ఉపాధి మస్టర్ వేస్తామన్నా.. ఆసక్తి చూపని ప్రజలు
- బస్సుల్లో జనం లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన ఉన్నతాధికారులు

పొన్నలూరు: అమరావతి పున ఃప్రారంభం పేరుతో కూటమి ప్రభుత్వం అమరావతిలో ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి సభ కోసం అధికారులు పడరాని పాట్లు పడ్డారు. మొదట పొన్నలూరు మండలానికి పది బస్సులు ఏర్పాటు చేసి జనాన్ని సమీకరించి సభకు తరలించాలని భావించారు. అయితే అనుకున్న స్థాయిలో ప్రజలు రావడానికి ఆసక్తి చూపించకపోవడంతో చేసేదేమిలేక మొక్కుబడిగా మూడు బస్సులు ఏర్పాటు చేశారు. పొన్నలూరు సెంటర్‌కు ఒకటి, విప్పగుంట సెంటర్, కె అగ్రహారం సెంటర్‌కి మూడు బస్సులు ఏర్పాటు చేశారు. ఈ బస్సుల్లో బస్సుకు 40 మంది చొప్పున జనాన్ని సమీకరించి వారికి తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులు భావించారు. అలాగే బస్సుల్లో వెళ్లే ప్రజలు కోసం మండలానికి చెందిన టీడీపీ నాయకుడి ద్వారా పులిహోరా, పెరుగన్నం, వాటర్ బాటిల్, అరటిపండుతో ప్రత్యేక ప్యాకెట్ ఏర్పాటు చేయించారు. అలాగే గ్రామాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్, డ్వాక్రా వీవోఏ ద్వారా జనాన్ని సేకరించాలని ఆదేశించారు. అయితే మండలంలో ఏర్పాటు చేసిన బస్సుల్లో పట్టుమని పదిమంది కూడా లేకపోవడంతో మండల స్థాయి అధికారి కింది స్థాయి ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా అమరావతి పున ఃప్రారంభం సభకు వెళ్లే వారికి ఉపాధి హామీ మస్టర్ వేస్తామని చెప్పినప్పటికి ఎవరూ ఆసక్తి చూపకపోవడం గమనార్హం. దీంతో మూడు బస్సుల్లో జనాన్ని పూర్తిస్థాయిలో ఎక్కించడానికి అధికారులు తలలు పట్టుకున్నారు.

బతిమలాడుకున్న అధికారులు..

ఈ క్రమంలో డ్వాక్రా మహిళలను కొందరిని బతిమలాడి, సీసీలతో మాట్లాడించి తప్పక రావాలని అరకొరగా వచ్చిన వారిని ఎక్కించారు. అలాగే కొందరు పురుషులకు మద్యం సీసాలు ఇస్తామని చెప్పి స్థానిక నాయకులు పంపించినట్లు సమాచారం. దీనికి తోడు ప్రతి బస్సుకు ఆరోగ్య సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్, వెలుగు సీసీ, మహిళా పోలీస్‌తో పాటు మరి కొంతమంది కింది స్థాయి ఉద్యోగులను ఎక్కించి పంపించారు. మండలానికి కేటాయించిన మూడు బస్సులను తహసీల్దార్ కార్యాలయం దగ్గర రప్పించి అక్కడ నుంచి అమరావతి పున ఃప్రారంభం సభకు తరలించారు. ఈకార్యక్రమంలో వలన అధికారులు అందుబాటులో లేకపోవడంతో పలు సమస్యలపై ప్రభుత్వ కార్యాలయాల దగ్గరకు వచ్చిన అర్జీదారులు ఇబ్బందులు పడ్డారు. మొత్తంగా సభకు వెళ్లడానికి మండల ప్రజలే ఆసక్తి చూపకపోవడంతో పాటు, ఆశించిన స్థాయిలో జన సమీకరణ జరగకపోవడంతో అధికారులు నిరాశ చెందారు.



పొన్నలూరులో ఆహార ప్యాకెట్లు సరఫరా చేస్తున్న దృశ్యం

సింగరాయకొండ: మండలం నుంచి 5 బస్సుల్లో 50 మంది డాక్రా మహిళలు, 200 మంది ఉపాధి కూలీలను తరలించాలని లక్ష్యాన్ని ఏపీవో, ఏపీఎంలకు నిర్దేశించారు. వీరిని బస్సు ఎక్కించే బాధ్యత ఎంపీడీవో జయమణి, భోజన ఏర్పాట్లు చూసే బాధ్యత తహశీల్దార్ టీ రవికి అప్పగించారని గ్రామ సచివాలయ అధికారులు చర్చించుకుంటున్నారు. తహశీల్దార్ ఉదయం 6.30 గంటలకు రాగా, ఎంపీడీవో డీ జయమణి సుమారు 7.20 గంటలకు వచ్చారు. అప్పటికి డాక్రా మహిళలు మాత్రమే రావటంతో ఉపాధి శ్రామికులు ఏరని ఆమె ఆశాఖకు చెందిన మండల, గ్రామస్థాయి అధికారులను హెచ్చరికల జారీ పనిలో బిజీబిజీగా గడిపారు. చివరికి ఒక బస్సును రద్దు చేసి నాలుగు బస్సుల్లో 119 మందిని తరలించారు.

టంగుటూరు: మండలానికి మూడు బస్సులను కేటాయించి ఉపాధి హామీ కూలీలను 100 మందిని, అలాగే డ్వాక్రా మహిళలను, వీఓఏలు, సీసీలు మొత్తం 50 తరలించాలని అధికారులకు హుకుం జారీ చేశారు.



పొన్నలూరులో అరకొర జనంతో ఖాళీగా దర్శనమిస్తున్న బస్సు



సింగరాయకొండలో జనాలకు టిఫిన్ వడ్డిస్తున్న రెవెన్యూ అధికారులు



టంగుటూరులో బస్సులోకి భోజన ప్యాకెట్లు తరలిస్తున్న అధికారులు

నేడు ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక

మర్రిపూడి: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తారని ఎంపీడీఓ జగదీష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జరుగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి, అన్ని శాఖల అధికారులు హాజరౌతారన్నారు. మండల ప్రజలు వివిధ రకాల సమస్యలపై అర్జీలు అందించి తమ సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు.

కనిగిరి డివిజన్‌లో 86.8 మిమీల వర్షపాతం నమోదు



రోడ్డుపై పారుతున్న వాగు

కనిగిరిరూరల్: కనిగిరి డివిజన్‌లోని 13 మండలాల్లో శుక్రవారం 86.8 మిమీల వర్షపాతం నమోదుకాగా, సరాసరినా 6.6 మీమీల వర్షం పాతం పడినట్లు అధికారులు తెలిపారు. కనిగిరిలో 47.2 మిమీల వర్షపాతం నమోదు కాగా, వెలిగండ్లలో 16.0 మిమీల వర్షపాతం, సీఎస్‌పురంలో 2.4 మీమీల వర్షపాతం పడింది. పాదిలిలో 10.4 మిమీల, కేకే మిట్లలో 3.4 మిమీల, మర్రిపుడిలో 7.4 మిమీల, వర్షపాతం నమోదు జరిగినట్లు అధికారులు వెల్లడించారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

మర్రిపూడి: మండల కేంద్రమైన మర్రిపూడి పడమటిబజారులో వేంచేసిన బ్రహ్మంగారి ఆలయంలో గోవిందమాంబ సమేత పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణ మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు దారుకుమల్లి నర్సమ్మ ఆధ్వర్యంలో స్వాములవారి మూలవిరాట్‌లను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయం వద్ద స్వాములవారి చిత్రపటాలను పూలమాలలతో అలంకరించి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణాన్ని పూజారి గౌరీశంకర్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం భక్తులు ఆలయానికి చేరుకుని కల్యాణాన్ని తిలకించారు. స్వాములవారి ప్రతిమలను పల్లకి పై ఉంచి గ్రామంలో మేళతాళాలతో గ్రామోత్సవం ఘనంగా జరిగింది. భక్తులు స్వాములవారిని దర్శించుకుని పునీతులయ్యారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. దారుకుమల్లి బ్రహ్మం జ్యోతిలు ఉభయదాతలుగా వ్యవహరించారు.

అసంబద్ధ విధానాలు విరమించుకోవాలి

కనిగిరిరూరల్: పాఠశాలల్లోని అసంబద్ధ విధానాలను విరమించుకోవాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్‌కే నాయబ్ రసూల్ అన్నారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ప్రాంతీయ సమావేశం జరిగింది. అనంతరం రాష్ట్ర కౌన్సిలర్ పీ రాజ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయబ్ రసూల్ మాట్లాడుతూ 1నుంచి 5 తరగతులను హై స్కూల్‌కు అనుసంధానం చేసే విధానంను తక్షణం ప్రభుత్వం ఉప సంహరించుకోవాలన్నారు. ఈనెల 5న స్థానిక తహసీల్దార్ కార్యాలయ వద్ద జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆరు మండలాల ఏపీటీఎఫ్ నాయకులు కేవీ సుబ్బయ్య, ఎస్‌కే హుస్సేన్, కే రామ్మోహన్, పి మాలకొండయ్య, ఎన్వీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రం పరిశీలన

పీసీపల్లి: మండల పరిధిలోని గుదేవారిపాలెం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని డీఎల్పీవో హనుమంతరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త ద్వారా వర్మీం కంపోస్ట్ ఎరువులు తయారు చేయాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఉండే ఎస్‌డబ్ల్యూపీసీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈయన వెంట డిప్యూటీ ఎంపీడీవో రాంప్రసాద్, కార్యదర్శి సౌజన్య గ్రామస్తులు పాల్గొన్నారు.



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్పీవో హనుమంతరావు

అంధకారంలో గుండ్లపాలెం

కనిగిరిరూరల్: మండలంలోని గుండ్లపాలెం గ్రామం అంధకారంలో ఉంది. శుక్రవారం తెల్లవారు జామున కురిసిన వర్షానికి పునుగోడులోని రోడ్డులోని ప్రధాన కండక్టర్ వైరుతో పాటు, సబ్‌స్టేషన్లలోని ఓబీలు (సాంకేతిక సమస్యలు) రావడంతో బొమ్మిరెడ్డి పల్లి పంచాయతిలోని కొన్ని గ్రామాలకు కరెంట్ సరఫరా నిలిచింది. మరమ్మతులతో రాత్రికి కొన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ అయినప్పటికి.. గుండ్లపాలెం మాత్రం అంధకారంలో ఉంది. సుమారు 1,200 మంది జనాభ నివసించే గ్రామంలో రాత్రి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా లేక పోవడంతో ఆ గ్రామంలో చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. దీనిపై విద్యుత్ ఏఈని సాక్షి అడగ్గా.. ఉరుములు, మెరుపులు కారణంగా ఉదయం నుంచి 33 కేవీ బ్రేక్ డౌన్ అయ్యిందని, 132 కేవీ ఎస్ఎస్‌లో సాంకేతిక సమస్యలు వచ్చాయని, పునుగోడు రోడ్‌లో కండక్టర్ తెగిందని, బొమ్మిరెడ్డిపల్లి వద్ద బ్రేక్ డౌన్ అయ్యిందన్నారు. వాటన్నింటిని మరమ్మతులు చేసి విద్యుత్ సప్లయ్ ఇస్తున్నామని, రాత్రికి గుండ్లపాలెం గ్రామానికి కూడా కరెంట్‌ను ఇస్తామని తెలిపారు.

బాస్కెట్‌బాల్ శిక్షణ శిబిరం ప్రారంభం



శిక్షణా శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఆంజనేయులు, జయకుమార్

పామూరు: విద్యార్థులు బాస్కెట్‌బాల్ ఉచిత వేసవి శిక్షణా శిబిరాన్ని ఉపయోగించుకోవాలని ట్రైనర్ ఆంజనేయులు, ఎం.జయకుమార్‌లు అన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ప్రకాశం జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సెయింట్‌మార్క్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఉచిత బాస్కెట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభించారు. ఈసందర్భంగా శుక్రవారం రాత్రి ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని ఆంజనేయుడు, జయకుమార్‌లు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బాస్కెట్‌బాల్ శిక్షణా శిబిరం ఈనెల 31వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, మళ్లీ సాయంత్రం 5 నుంచి రాత్రి 7 గంటల వరకు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏడుకొండలు, విద్యార్థులు పాల్గొన్నారు.